సాక్షి సిద్దిపేట

శుక్రవారం । 19 । ఏప్రిల్ । 2024

● రఘునందన్ ఆస్తులు, అప్పులు..

జోగిపేట (అందోల్) : మెదక్ లోక్‌సభ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు స్థిర ఆస్తుల(భూములు, భవనాలు) విలువ రూ. 3.65 కోట్లు ఉన్నట్లు ఎన్నికల అఫిడవిట్‌లో తెలిపారు. ఇందులో ఆయన సతీమణి మంజులదేవి స్థిర ఆస్తుల విలువ రూ.9.09 కోట్లు ఉందని పేర్కొన్నారు. అలాగే, వివిధ బ్యాంకుల్లో తీసుకున్న అప్పులు(లోన్లు) 4.28 కోట్లు కాగా, ఇందులో ఆయన సతీమణి మంజుల దేవి పేరుతో ఉన్న అప్పులను రూ. 7.83 కోట్లు తెలిపారు. చరా ఆస్తులు(వివిధ బ్యాంకుల్లో నగదు డిపాజిట్లు, ఫిక్స్‌డ్ డిఇపాజిట్లు, జ్యువెలరీ) రూ. 9.02 కోట్లు ఉన్నట్లు పేర్కొన్న రఘునందన్, ఇందులో సతీమణికి సంబంధించినవి రూ. 11,60,704గా తెలిపారు. రఘునందన్ కు 76 గుంటల వ్యవసాయ భూమి ఉందని, ఆయన భార్యకు 44.2975 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్లు పేర్కొన్నారు. రఘునందన్ రావుపై 29 క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు, ఒక ఫార్చునర్ కారు ఉందని అఫిడవిట్‌లో తెలిపారు.



జోరుగా వడ్డీ వ్యాపారం

ప్రజల అవసరాన్ని ఆసరా చేసుకుంటున్న వడ్డీ వ్యాపారులు అందినకాడికి దండుకుంటున్నారు.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై నిఘా

సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: జిల్లాలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘాతో పాటు పటిష్ట పోలీసు బందోబస్తు నిర్వహించినట్లు సిద్దిపేట సీపీ అనురాధ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ లోకసభ ఎన్నికల సందర్భంగా ఫ్రీ అండ్ ఫెయిర్ ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం అన్ని రకాల చర్యలు చేపట్టిందన్నారు. పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లాలో 11 ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్, 13 స్టాటికల్ సర్వేలెన్స్ టీమ్స్, 26 ఎమ్‌సీసీ టీమ్స్‌తో విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 1,009 పోలింగ్ స్టేషన్లలో 151 క్రిటికల్, 858 నార్మల్ పోలింగ్ స్టేషన్లను గుర్తించినట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు నిర్వహించిన తనిఖీల్లో రూ.66.10 లక్షలు సీజ్ చేశామని, 1,259 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకుని 117 కేసులు నమోదు చేశామన్నారు. ప్రైవేటు వ్యక్తుల నుంచి 28 తుపాకులు డిపాజిట్ చేయించామన్నారు. 109 మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. పీడీఎస్ రైస్‌పై 22 కేసులు నమోదు చేశామన్నారు.

క్రోమోటోగ్రాఫిక్ జాతీయ స్థాయి శిక్షణ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ప్రసాద్ తదితరులు

సిద్దిపేట ఎడ్యుకేషన్: ఈనెల 26, 27న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ (అటానమస్) కళాశాలలో రసాయన శాస్త్ర విభాగంలో క్రోమోటోగ్రాఫిక్ జాతీయ కార్యశాల నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్ తెలిపారు. గురువారం కళాశాలలో దీనిపై జాతీయ స్థాయి శిక్షణ శిబిరానికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రసాయనశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ వాసం శ్రీనివాస్, కార్యశాల ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ బాలకిషన్, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ గోపాల సుదర్శనమ్, రసాయన శాస్త్ర అధ్యాపకులు ఆంజనేయులు, డాక్టర్ రవి కుమార్, డాక్టర్ సుమలత, శ్యామ్ సుందర్, సలీమ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

6 లోపు పరీక్ష ఫీజు చెల్లించాలి

సిద్దిపేట ఎడ్యుకేషన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ మొదటి సంవత్సరం ఫస్ట్ సెమిస్టర్ పరీక్ష ఫీజు మే 6వ తేదీ వరకు కట్టవచ్చని రీజినల్ కో–ఆర్డినేటర్ డాక్టర్ మధుసూదన్ గురువారం తెలిపారు. పరీక్షలు మే 26 నుంచి జూన్ 1 వరకు జరుగుతాయని పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు కాంగ్రెస్ ఎన్నికల సన్నాహక సమావేశం

హుస్నాబాద్: కాంగ్రెస్ నియోజకవర్గ శ్రేణులతో లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశం శుక్రవారం మండలంలోని పొతారం(ఎస్) శుభం గార్డెన్‌లో నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, నాయిని రాజేందర్, మేడిపల్లి సత్యం హాజరుకానున్నారు. అయితే సిద్దిపేట డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు అల్లిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, ఆరేపల్లి మోహన్, సత్యనారాయణ గౌడ్, పురమల్ల శ్రీనివాస్, వొడితెల ప్రణవ్, కేకే మహేందర్ రెడ్డిలు కూడా పాల్గొంటారు.

కాంగ్రెస్‌లో చేరికలు



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న లక్ష్మి తదితరులు

సిద్దిపేటరూరల్: మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి సమక్షంలో నారాయణరావుపేట మండలం జక్కాపూర్ గ్రామానికి చెందిన మహిళలు గురువారం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పెద్ద ఎత్తున 40 మంది పార్టీలో చేరడం ఒక మార్పుకు నిదర్శనమన్నారు. చేరిన వారికి సముచిత స్థానాన్ని కల్పిస్తామన్నారు. మేనిఫెస్టోలో ఎక్కువ సంక్షేమ పథకాలు మహిళలను ప్రోత్సహించేలా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజ్ వీర్, నాయకులు శ్రీనివాస్, శ్రీశైలం, మహిళా కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షురాలు రేణుక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



మొదటి నామినేషన్‌ను కలెక్టర్‌కు అందజేస్తున్న బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు



నీలం మధు తరఫున నామినేషన్ దాఖలు చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్ రావు



తెలంగాణ ప్రజాశక్తి నుంచి దొడ్ల వెంకటేశం



స్వతంత్ర అభ్యర్థి చిక్కులపల్లి నవీన్‌కుమార్



సురేష్‌కుమార్ షెట్కార్ తరఫున సాగర్ నుంచి నామినేషన్ పత్రాలను స్వీకరిస్తున్న కలెక్టర్ క్రాంతి

తొలిరోజు 6 నామినేషన్లు

మెదక్ పార్లమెంట్ పరిధిలో ఐదు | **జహీరాబాద్‌లో ఒకటి దాఖలు**

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి/మెదక్ కలెక్టరేట్: పార్లమెంట్ ఎన్నికల పోరులో తొలిఘట్టం ప్రారంభమైంది. నామినేషన్ల పర్వానికి తెరలేచింది. మొదటి రోజు ఆరు నామినేషన్లు దాఖలయ్యాయి. మెదక్ పార్లమెంట్ పరిధిలో 5, జహీరాబాద్ పరిధిలో ఒక నామినేషన్ సమర్పించారు. గురువారం దశమి మంచి రోజు కావడంతో మెదక్ బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావు ఉదయం 11.33 గంటలకు తన మొదటి నామినేషన్ దాఖలు చేశారు. అలాగే కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు తరఫున మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు మధ్యాహ్నం 1.46 గంటలకు మొదటి నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు అందజేశారు. తెలంగాణ ప్రజాశక్తి పార్టీ అభ్యర్థి దొడ్ల వెంకటేశం 2 సెట్ల నామినేషన్ దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థి చిక్కులపల్లి నవీన్‌కుమార్ నామినేషన్ వేశారు. అలాగే జహీరాబాద్ పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా సురేష్‌కుమార్ షెట్కార్ తరఫున ఎస్.సాగర్ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి నామినేషన్ పత్రాలను స్వీకరించారు. పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులంతా కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. అభ్యర్థులు తమ వాహనాలను కార్యాలయానికి వంద మీటర్ల దూరంలో పెట్టుకోవాలన్నారు. నామినేషన్ వేసేందుకు ఐదుగురు మాత్రమే లోనికి రావాలని చెప్పారు.

ఇబ్బంది పడిన ప్రజలు

మెదక్ కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి కార్యాలయం ఏర్పాటు చేయడంతో పోలీసులు ప్రజలను ఎవరిని లోపలికి అనుమతించలేదు. విషయం తెలియక వివిధ పనులపై కలెక్టరేట్‌కు వచ్చిన ప్రజలను ప్రధాన గేటు నుంచి లోనికి వెళ్లకుండా అడ్డుకున్నారు. మధ్యాహ్నం 3 గంటల తర్వాత వెళ్లాలని సూచించారు. దీంతో మండుతున్న ఎండలో చేసేది లేక వెనుదిరిగి వెళ్లిపోయారు.

అమృత్ 2.0



తాగునీటికి తప్పనున్న తిప్పలు

- సిద్దిపేట మున్సిపాలిటీకి రూ 87.50 కోట్లు
- చేర్యాలకు రూ 13.5 కోట్లు మంజూరు
- రెండింటిలో ఎనిమిది ట్యాంక్‌ల నిర్మాణం

మున్సిపాలిటీల్లో తాగునీటి వ్యవస్థ పటిష్టం కానుంది. కేంద్రం అమృత్ (అటల్ మిషన్ ఫర్ రిజువెషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫరేషన్) 2.0 పథకం కింద ఎంపిక చేసిన పట్టణాల్లో తాగు నీటి పథకాలను విస్తరించేందుకు చర్యలు చేపట్టింది. మున్సిపాలిటీల్లో ఓవర్‌హెడ్ ట్యాంకులు, నూతన పైప్‌లైన్ల నిర్మాణం చేపట్టనున్నారు. ఇందుకోసం జిల్లాలోని సిద్దిపేట, చేర్యాల మున్సిపాలిటీల్లో నిధులు ఖర్చు చేయనున్నారు. దీంతో జిల్లాలోని సిద్దిపేట, చేర్యాల మున్సిపాలిటీల్లో తాగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కానుంది.

– సాక్షి, సిద్దిపేట

సిద్దిపేట, చేర్యాల మున్సిపాలిటీల్లో తాగునీటి శాశ్వత పరిష్కారం కోసం రూ.101 కోట్లను అమృత్ 2.0 ద్వారా కేటాయించారు. ఇందులో సిద్దిపేటకు రూ. 87.50 కోట్లు, చేర్యాలకు రూ.13.50 కోట్లు మంజూరు చేశారు. సిద్దిపేట మున్సిపాలిటీలో 41,302 నివాస గృహాలు, చేర్యాల మున్సిపాలిటీలో 4,929 నివాస గృహాలున్నాయి. పెరగనున్న జనాభాను దృష్టితో పెట్టుకొని పైప్‌లైన్లను విస్తరించడం, వాటర్ ట్యాంకులను నిర్మించేందుకు ఈ నిధులు వినియోగించనున్నారు. ఆయా మున్సిపాలిటీల నుంచి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించడంతో విలీన కాలనీలు, శివారు కాలనీలు.. ఎండాకాలంలో ఎదుర్కొంటున్న తాగు నీటి సమస్యకు చెక్ పడనుంది. ట్యాంకుల నిర్మాణానికి మున్సిపాలిటీలో స్థలాలను కూడా ఎంపిక చేశారు. వచ్చే ఏడాదిలోగా ఈ పనులన్నీ పూర్తి అయితే పట్టణాల్లో తాగునీటికి ఇబ్బందులు ఉండదు.

సమస్యలు తీరుతాయి

జిల్లాలోని పలు మున్సిపాలిటీలు నిధుల లేమితో ప్రజల తాగునీటి అవసరాలు తీర్చలేకపోతున్నాయి. చేర్యాల పంచాయతీగా ఉన్నప్పుడు నీటి సరఫరా ఏ విధంగా ఉందో ఇప్పుడూ అదే విధంగా ఉంది. దీంతో వేసవిలో ప్రజలు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. జనాభాకనుగుణంగా, భవిష్యత్ అవసరాల దృష్ట్యా తాగునీటి పథకాలు ఏర్పాటు కాలేదు. కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకం 2.0 కింద నిధులు కేటాయించడంతో ఆయా పట్టణ వాసులకు తాగునీటి తిప్పలు తీరనున్నాయి.

ట్యాంకులు ఎక్కడెక్కడంటే..

పట్టణాల్లో జనాభా క్రమేణా పెరుగుతోంది. ప్రజల అవసరాలను తీర్చాల్సిన బాధ్యత ఆయా మున్సిపాలిటీలపై ఉంటుంది. అందులో భాగంగానే కొత్త కాలనీల్లో తాగునీటి పైప్‌లైన్‌ల ఏర్పాటుతో పాటు నల్లా కనెక్షన్లు, ట్యాంకుల నిర్మాణాలు చేపట్టనున్నారు. సిద్దిపేట పట్టణంలో మరో 60 లక్షల లీటర్ల నీటి సామర్థ్యంతో ఐదు తాగునీటి ట్యాంక్‌లను నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. అందులో భాగంగా బాలాజీ గార్డెన్ 10 లక్షల లీటర్లు, మహిళా డిగ్రీ కళాశాల 15 లక్షల లీటర్ల, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ 15 లక్షల లీటర్లు, టీచర్స్‌కాలనీ 10 లక్షల లీటర్లు, కప్పలకుంట 10 లక్షల లీటర్ల సామర్థ్యం ఉన్న ట్యాంక్‌లను నిర్మించనున్నారు. అలాగే 100 కిలో మీటర్ల మేర పైప్‌లైన్‌ను ఏర్పాటు చేయనున్నారు. చేర్యాల మున్సిపాలిటీ పరిధిలో మూడు చోట్ల వాటర్ ట్యాంక్‌లను నిర్మించనున్నారు. న్యూ బస్టాండ్ దగ్గర 10 లక్షల లీటర్ల, ఏఎంసీ మార్కెట్, పోచమ్మ ట్యాంక్ ఏరియాలో 5లక్షల లీటర్ల చొప్పున ట్యాంక్‌లను నిర్మించాలని నిర్ణయించారు. మెయిన్ పైప్‌లైన్ 7.80కిలో మీటర్లు,నెట్‌వర్క్ పైప్‌లైన్ 8.30కిలో మీటర్లు ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే టెండర్లు పూర్తి కాగా త్వరలో పనులు ప్రారంభించనున్నారు.

సమస్యలను అధిగమిద్దాం

హుస్నాబాద్‌రూరల్: పల్లెలో తాగు నీటి సమస్యలను అధికమించి ప్రజలకు నీటి సరఫరా చేయాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) దేవకీదేవి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో అక్కన్నపేట, హుస్నాబాద్ మండలాల తాగునీటి సరఫరాపై అధికారులతో కలిసి ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఎండల దృష్ట్యా బావుల్లో భూగర్భ జలాలు అడుగంటి నీటి సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించి నీటి సరఫరా చేయాలన్నారు. నల్లా నీరు వృథా చేయకుండా ప్రజలకు అవగాహన కల్పించి పొదుపుగా వాడుకోవాలనే చేయాలని అధికారులకు సూచించారు. పైపులైన్ మరమ్మతులు ఉంటే వెంటనే చేయించాలన్నారు. సమావేశంలో ఎస్ఈ శ్రీనివాసచారి, డీఈ రుహీన, డీఎల్పీఓ వెంకటేశ్వర్లు, ప్రత్యేక అధికా సరోజ, ఎంపీడీఓలు, ఎంపీఓ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థులకు బీఫాంలు

అనిల్, వెంకట్రామిరెడ్డికి అందజేసిన కేసీఆర్



కేసీఆర్ నుంచి బీ ఫాం అందుకుంటున్న గాలి అనిల్ కుమార్, వెంకట్రామిరెడ్డి

జహీరాబాద్ / సంగారెడ్డి : జహీరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గాలి అనిల్‌కుమార్‌కు, మెదక్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిలకు ఆ పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బీఫాం అందజేశారు. గురువారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బీఫారంతో పాటు రూ.95 లక్షల ఎన్నికల ఖర్చు చెక్కును అందజేశారు. జహీరాబాద్, మెదక్‌లో భారీ మెజార్టీతో గెలుపొంది గులాబీ జెండాను ఎగరవేయాలని కేసీఆర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కె.మాణిక్‌రావు, సునితారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు భూపాల్‌రెడ్డి, క్రాంతికిరణ్, హనుమంత్‌షిండే, సురేందర్, గంప గోవర్ధన్, జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, దేవిప్రసాద్ పాల్గొన్నారు.

పార్టీలు సహకరించాలి

అడిషనల్ కలెక్టర్ గరీమా అగర్వాల్

దుబ్బాక: లోక్‌సభ ఎన్నికలు సజావుగా జరిగేలా రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని అడిషనల్ కలెక్టర్, దుబ్బాక నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి గరీమా అగర్వాల్ అన్నారు. గురువారం పట్టణంలోని ఐఓసీ కార్యాలయంలో ఎన్నికలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ఎలాంటి వివాదాలకు తావివ్వకుండా జరుపుకొందామన్నారు. ఈ సందర్భంగా ఓటరు నమోదుకు సంబంధించిన ఫాంల డిస్పోజల్, నామినేషన్ పత్రాలకు సంబంధించిన వివరాలు తెలిపారు. వృద్ధులు, దివ్యాంగులకు సంబంధించి పోస్టల్ బ్యాలెట్ విషయాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె చర్చించారు.

నిబంధనలు తప్పనిసరి

ఆర్డీఓ రామ్మూర్తి

హుస్నాబాద్: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా నిబంధనలు అన్ని రాజకీయ పార్టీలు పాటించాలని ఆర్డీఓ రామ్మూర్తి కోరారు. ఐఓసీ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణపై వివిధ రాజకీయ పార్టీల నాయకులతో కలిసి ఆయన గురువారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ సెంటర్ హుస్నాబాద్ మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ కళాశాలలో రిసెప్షన్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సెంటర్‌కు అన్ని పార్టీల ప్రతినిధులు రావాలన్నారు. అనంతరం హుస్నాబాద్ నియోజకవర్గంలోని సెక్టోరియల్ అధికారులతో కలిసి ఆర్డీఓ సమావేశం నిర్వహించారు.

25 లోగా నామినేషన్ దాఖలు చేయాలి

కరీంనగర్ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఈ నెల 25వ తేదీ లోగా కరీంనగర్ కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలను దాఖలు చేయాలని ఆర్డీఓ రామ్మూర్తి తెలిపారు.

కాంగ్రెస్‌ను తరిమికొట్టాలి

- నాలుగు నెలలు గడుస్తున్నా గ్యారంటీల అమలేదీ?
- బండి సంజయ్ ఓడిపోవడం ఖాయం
- మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు



మాట్లాడుతున్న హరీశ్‌రావు పక్కన కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్

బెజ్జంకి(సిద్దిపేట): రైతులు, మహిళలు, అన్ని వర్గాల ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైన కాంగ్రెస్ పార్టీని లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు తరిమికొడతారని మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. కరీంనగర్ ఎంపీగా బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేస్తున్న వినోద్ కుమార్‌కు మద్దతుగా గురువారం బెజ్జంకిలో నిర్వహించిన సభలో టీస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతులు పండించిన పంటలకు ఇస్తామన్న బోనస్ ఇంకా అమలు చేయలేదన్నారు. రుణమాఫీ చేయలేదని, పెన్షన్లు పెంచలేదని గుర్తుచేశారు. అలాంటి కాంగ్రెస్‌కు ఎందుకు ఓటు వేయాలని ప్రశ్నించారు. నాలుగు నెలలు గడిచినా ఆరు గ్యారంటీలు అమలు చేయని సీఎం రేవంత్‌రెడ్డికి గుణపాఠం చెప్పాలంటే ప్రశ్నించే గొంతుక వినోద్‌కుమార్‌ను ఎంపీగా గెలిపించాలని ప్రజలను కార్యకర్తలను కోరారు. బెజ్జంకి చెరువుల్లో నీరు నింపలేదని దీంతో పంటలు ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీగా బండి సంజయ్ ఏం చేశాడని ప్రశ్నించారు. ఈసారి ప్రజలు మార్పు కోరుకుంటున్నారని ఆయనను ఓడిపోవడం ఖాయమన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలతో పాటు నిత్యావసర ధరలు పెంచి సామాన్యుల నడ్డీ విరుస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వైఖరిని ఎండగట్టాలంటే బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు. అనంతరం ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్ర ఏర్పాటుతో పాటు అభివృద్ధి కోసం కృషి చేసిన బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని విన్నవించారు. కార్యక్రమంలో ఎంపీపీ లింగాల నిర్మల, వైస్ ఎంపీపీ సబిత, మండలాధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, నాయకులు, శ్రీనివాస్‌గుప్తా, శ్రీనివాసరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గజ్వేల్‌పై ఫోకస్

మెదక్ ఎంపీ ఎన్నికలకు సంబంధించి అన్ని పార్టీల దృష్టి ఆ అసెంబ్లీ స్థానంపైనే కేంద్రీకృతమై ఉంది. ఈ ప్రాంతం మాజీ సీఎం సొంత ఇలాకా కావడంతో అన్ని పార్టీలకు ప్రత్యేకంగా మారింది. ఇక్కడ అధిక మెజారిటీని సాధించడం ద్వారా గెలుపునకు బాటలు వేసుకోవాలనే తాపత్రయంతోపాటు బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీలు ఆరాట పడుతున్నాయి. ఇప్పటికే సమావేశాలను నిర్వహించిన పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేయడంతోపాటు ప్రచారాన్ని ముమ్మరం చేయడానికి ప్రయత్నిస్తున్నాయి. అదే గజ్వేల్ అసెంబ్లీ స్థానం. మెదక్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో మెదక్, సంగారెడ్డి, పటాన్‌చెరు, సిద్దిపేట, దుబ్బాక, నర్సాపూర్‌తోపాటు గజ్వేల్ అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్నాయి.

- కేసీఆర్ 'ఇలాకా'.. అన్ని పార్టీలకు ప్రత్యేకం
- ఎంపీ ఎన్నికల్లో అధిక మెజారిటీయే లక్ష్యం
- ఊపందుకోనున్న ప్రచార పర్వం

గజ్వేల్: గజ్వేల్ నియోజకవర్గంలోని గజ్వేల్, ములుగు, వర్గల్, జగదేవ్‌పూర్, కొండపాక, కుకునూర్‌పల్లి, మర్కూక్, మనోహరాబాద్, తూప్రాన్ మండలాల్లో మొత్తంగా 2,74,654 ఓట్లు ఉండగా... మహిళలు 1,38,353, పురుషులు 1,36,294, ఇతరులు ఏడుగురు ఉన్నారు. ఇటీవల జరిగిన శాసన సభా ఎన్నికల్లో గజ్వేల్‌లో కేసీఆర్‌కు ఇక్కడి ప్రజలు 45,031 ఓట్ల భారీ మెజార్టీని అందించారు. మొత్తంగా 2,32,417 ఓట్లు పోల్ కాగా అందులో కేసీఆర్‌కు 1,11,684 ఓట్లు దక్కాయి. సమీప ప్రత్యర్థి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు 66,653 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి తూంకుంట నర్సారెడ్డికి 32,568 ఓట్లు వచ్చాయి. బరిలో ఉన్న మరో 41 మంది అభ్యర్థులందరికీ కలిపి 21,512 ఓట్లు వచ్చాయి. అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన మెజార్టీని ప్రస్తుత ఎంపీ ఎన్నికల్లోనూ నిలుపుకోవడానికి బీఆర్‌ఎస్ ప్రయత్నిస్తుంది. ఈ క్రమంలోనే కేసీఆర్ ఈ ప్రాంతాన్ని రాష్ట్రంలోనే నమూనాగా తీర్చిదిద్దారని మరోసారి ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తుంది. ఈ నియోజకవర్గానికి కేసీఆర్ మంజూరు చేసిన రూ.150 కోట్ల అభివృద్ధి నిధులను కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రద్దు చేసిందని ప్రజలకు వివరిస్తుంది. ఇప్పటికే పార్టీ యంత్రాంగం.. నియోజకవర్గస్థాయిలోనే కాకుండా మండల స్థాయిలోనూ సమావేశాలను నిర్వహించి పార్టీ శ్రేణులను ఎన్నికలకు సమాయత్తం చేసింది. ప్రచార పర్వాన్ని హోరెత్తించడానికి ప్రచార రథాలను రంగంలోకి దింపారు.

ముఖ్య నేతల పర్యవేక్షణ...

మాజీ మంత్రి హరీశ్‌రావు సూచనల మేరకు ప్రచార కార్యక్రమాలను ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పర్యవేక్షిస్తుండగా, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి ఇతర ముఖ్య నేతల సహకారమందిస్తున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ సైతం దీటుగా ప్రచార పర్వాన్ని కొనసాగిస్తుంది. డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి ఆధ్వర్యంలో జోరుగా కార్యక్రమాలు సాగుతున్నాయి. నియోజకవర్గం, మండల స్థాయిలో సమావేశాలను నిర్వహిస్తూ బీఆర్‌ఎస్ నుంచి వలసలను ఆకర్షిస్తున్నారు. అంతేకాకుండా గత ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గజ్వేల్ నియోజకవర్గంలో కేసీఆర్‌కు వచ్చిన మెజారిటీ కంటే ఒక్క ఓటైన ఎక్కువగా సాధించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. అంతేకాకుండా బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ నిర్వాసితులకు తీరని అన్యాయం చేశారనే ప్రచారం జోరుగా సాగిస్తున్నారు. ఇక బీజేపీ నేతలు ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే తమకు గజ్వేల్ నియోజకవర్గంలో భారీగా ఓట్లు వస్తాయని భావిస్తున్నారు. ఈ పార్టీ నేతలు సైతం సమావేశాలు, రోడ్ షోలను ముమ్మరం చేశారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థుల ప్రతికూలతలు, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను సైతం తమదైన శైలిలో ప్రజల్లో తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు.

క్లుప్తంగా

ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలి



కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

గజ్వేల్‌రూరల్: ఉపాధి పనులు చేపడుతున్న కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏగొండ స్వామి డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని అక్కారంలో ఉపాధి పనులు చేపడుతున్న కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏగొండ స్వామి మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో ఉపాధి పనుల ప్రాంతంలో నిలువ నీడ లేక ఎండకు తల్లడిల్లుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నీటి వసతి, ఓఆర్‌ఎస్‌లు అందుబాటులో లేవన్నారు. అధికారులు స్పందించి ఉపాధి కూలీల సమస్యల పరిష్కారానికి చొరవ చూపడంతో పాటు కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. పనిముట్లు, పనికి తగిన వేతనం సకాలంలో అందేలా చూడాలని డిమాండ్ చేశారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



కరాటే విద్యార్థులతో మాస్టర్లు

మెదక్ మున్సిపాలిటీ: కరాటే బెల్ట్ ఎగ్జామ్‌లో కేజీబీవీ విద్యార్థిని ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు కరాటే మాస్టర్ రియాజ్ తెలిపారు. గురువారం మెదక్ కేజీబీవీ పాఠశాలలో రెంజుకి షోటోకాన్ స్పోర్ట్స్ కరాటే అఫ్ ఇండియా ఆధ్వర్యంలో విద్యార్థులకు కరాటే బెల్టు ఎగ్జామ్ నిర్వహించారు. ఈ పోటీలకు చీఫ్ ఎగ్జామినర్‌గా రెంజుకి షోటోకాన్ స్పోర్ట్స్ కరాటే ఆఫ్ ఇండియా వ్యవస్థాపకుడు, సీనియర్ కరాటే మాస్టర్ నగేశ్, అబ్జర్వర్‌గా విద్యాసాగర్ వ్యవహరించారు. ఈ ఎగ్జామ్ లో సుమారు 50 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఇందులో స్పందన అనే విద్యార్థిని ఉత్తమ ప్రదర్శన కనబర్చి బ్రౌన్ బెల్ట్ సాధించినట్లు తెలిపారు.

అక్రమంగా మట్టి రవాణా

మూడు టిప్పర్‌లు సీజ్

మనోహరాబాద్(తూప్రాన్): మనోహరాబాద్ మండల కేంద్ర శివారు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని రవాణా చేస్తున్న టిప్పర్లను పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బుధవారం అర్ధరాత్రి అక్రమంగా మట్టిని రవాణా చేస్తున్నారనే సమాచారంతో మూడు టిప్పర్లను పట్టుకొని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలం లకుడారం మాజీ సర్పంచ్ కందూరి కనకవ్వ భర్త, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు కందూరి ఐలయ్య, మంగోల్ గ్రామ మాజీ ఎంపీటీసీ ఎల్లు మౌనిక భర్త శ్రీనివాస్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు గురువారం రాత్రి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హన్మంతరావు, తూకుంట నర్సారెడ్డి, మెదక్ పార్లమెంట్ అభ్యర్థి నీలం మధుల సమక్ష్యంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు రవీందర్, కిష్టారెడ్డి, ఐలం తదితరులు పాల్గొన్నారు.

సామూహిక కుంకుమార్చన



కుంకుమార్చన చేస్తున్న మహిళలు

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండల కేంద్రంలోని సీతారామచంద్ర స్వామి దేవాలయంలో శుక్రవారం రాత్రి మహిళలు సామూహిక కుంకుమార్చన చేశారు. సుమారు 600 మంది సామూహిక కుంకుమార్చనలో పాల్గొనడంతో దేవాలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక సందడి నెలకొంది. అనంతరం సీతారాముల ఉత్సవ మూర్తులను హంస వాహనంపై ఊరేగించారు. కార్యక్రమంలో మహిళలు, ఉత్సవాల నిర్వహణ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రమాదాల హైవే

ప్రమాదకరంగా మెదక్-ఎల్కతుర్తి జాతీయ రహదారి

- రోడ్డుకు ఇరువైపులా మురుగు కాల్వలు
- స్లాబ్ వేయకపోవడంతో ప్రమాదాలు
- ఇటీవల వేర్వేరు చోట్ల ఏడుగురు మృతి
- కనిపించని సూచిక బోర్డులు



జాతీయ రహదారి వెంట ప్రమాదకరంగా నిర్మించిన మురుగు కాల్వ

రామాయంపేట/నిజాంపేట (మెదక్): నూతనంగా నిర్మిస్తున్న మెదక్- ఎల్కతుర్తి జాతీయ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. ఇంకా నిర్మాణం పూర్తి కాకపోవడంతో ప్రమాదకరంగా మారి నిత్యం ఏదో ఒక చోట యాక్సిడెంట్‌లు అవుతూనే ఉన్నాయి. రోడ్డు పనులు కొనసాగుతున్న తరుణంలో ముందస్తు హెచ్చరిక బోర్డులు, గుర్తులు సరిగా ఏర్పాటు చేయలేదు. పనులు సైతం నెమ్మదించడం సాగుతున్నాయి. రోడ్డుకు ఇరువైపుల మురుగు కాల్వలు నిర్మిస్తున్నారు. కానీ వాటిపై స్లాబ్‌లు వేయకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికే ఈ రహదారిపై వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు మృతి చెందారు.

జిల్లా కేంద్రమైన మెదక్ నుంచి హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి వరకు 133 కిలో మీటర్ల మేర జాతీయ రహదారి (765డీ) నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. 8 నెలల కిందట రోడ్డు పనులు ప్రారంభించారు. ప్రారంభం నాటి నుంచి పనులు నిదానంగా సాగుతున్నాయి. కొన్ని చోట్ల తారు వేసి, మరికొన్ని చోట్ల వదిలేస్తున్నారు. పనులు జరుగుతున్న క్రమంలో ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అలాగే గ్రామాల వద్ద రోడ్డుకు ఇరువైపులా పెద్ద స్థాయిలో మురుగు కాల్వలు నిర్మిస్తున్నారు. కానీ వెంటనే స్లాబ్‌లు వేయకుండా వదిలివేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహదారులకు రాత్రి వేళలో కనిపించక కాల్వలోకి దూసుకెళ్తున్నారు. తొనిగండ్ల అటవీ ప్రాంతంలో మరీ ప్రమాదకరంగా మారింది.

ముందస్తు చర్యలు చేపట్టాలి



జాతీయ రహదారి నిర్మాణం సమయంలో ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. నిర్మాణ పనులు సక్రమంగా జరగడం లేదు. గ్రామాల వద్ద రోడ్డుకు ఇరువైపులా నిర్మిస్తున్న మురుగు కాల్వలు అత్యంత ప్రమాదకరంగా మారాయి. వెంటనే వీటిపై స్లాబ్ వేయించాలి.

– రాజయ్య, కాట్రియాల

హెచ్చరిక బోర్డులు పాతించాలి



జాతీయ రహదారి నిర్మాణంలో కొన్ని లొసుగులు కనిపిస్తున్నాయి. కల్వర్టులు, మురుగు కాల్వల నిర్మాణం వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి వేళ ప్రమాదాలు జరుగుతున్నాయి. కల్వర్టుల వద్ద రోడ్డు ఇరుకుగా మారింది. గ్రామాల వద్ద సాధ్యమైనంత మేర రోడ్డు విస్తరించాలి. ప్రమాదాలు జరిగితే జాతీయ రహదారుల శాఖ వారే బాధ్యత వహించాల్సి వస్తుంది.

–గవ్వల బాల్‌రాజు

ఇటీవల జరిగిన ప్రమాదాలు



తొనిగండ్ల వద్ద మురుగు కాల్వలో పడిపోయిన ట్రాక్టర్, పక్కనే మృతదేహం

- జనవరి ఒకటిన గంగాపూర్ తండాకు చెందిన మోద్యా నాయక్ తొనిగండ్ల వద్ద రోడ్డు పనులు కొనసాగుతున్న చోట వెనుక నుంచి లారీని ఢీకొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు.
- నాలుగు నెలల కిందట తొనిగండ్లకు చెందిన యువకుడు బాబు ట్రాక్టర్ నడుపుకుంటూ వెళ్తుండగా అదుపుతప్పి మురుగుకాల్వలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో యువకుడు మృత్యువాత పడ్డాడు.
- ఫిబ్రవరి 14న నిజాంపేట మండల కేంద్రంలో రోడ్డు నిర్మాణం పనులు కొనసాగుతున్న చోట ప్రైవేట్‌ను బస్సును లారీ ఢీకొట్టండతో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. .
- మార్చి 1న అక్కన్నపేట వద్ద రోడ్డు నిర్మాణం పనులు కొనసాగుతున్న చోట బొలేరో వాహనం బోల్తా పడి కామారెడ్డికి చెందిన షేక్ పీర్‌బాషా మృతి చెందాడు.
- ఏప్రిల్ 2వ తేదీన తొనిగండ్ల వద్ద రోడ్డు పనుల్లో ఉన్న జేసీబీ కరెంటు స్తంభాలను ఢీకొని లాక్కుపోగా, ఏకంగా పన్నెండు స్తంభాలు, రెండు ట్రాన్స్‌ఫార్మర్లు నేలకూలి కరెంటు సరఫరా నిలిచిపోయింది.
- మెదక్ సమీపంలో తీన్ నంబర్ చౌరస్తా వద్ద పనులు నిర్వహిస్తున్న జేసీబీ బోల్తా పడి యువకుడు మృతి చెందాడు.
- ఏప్రిల్ 13న నిజాంపేట శివారులో అక్కన్నపేటకు చెందిన యువకుడు ధర్మపతి బైక్‌పై వెళ్తూ ప్రమాదవశాత్తు నిజాంపేట వద్ద కాల్వలో పడి మృతి చెందాడు.
- లక్ష్మాపూర్ స్టేజీ వద్ద రోడ్డు వెడల్పు పనులు చేస్తున్న హిటాచీ ఆర్టీసీ బస్సును ఢీకొని త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పింది.

ఆత్మహత్య చేసుకుంటున్నానని సెల్ఫీ వీడియో

- వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేసిన వ్యక్తి
- చెట్టుకు ఉరి వేసుకొని కిందపడగా రక్షించిన పోలీసులు



వంశీతో మాట్లాడుతున్న పోలీసులు

అల్లాదుర్గం(మెదక్): ఆత్మహత్య చేసుకుంటున్నానని సెల్ఫీ వీడియో తీసిన ఓ వ్యక్తి ఊరి చివరన చెట్టుకు ఉరి వేసుకుంటుండగా పోలీసులు కాపాడారు. ఈ ఘటన మండల పరిధిలోని ముస్లాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఇప్ప వంశీ (35) ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుంటానని 15 రోజులుగా చుట్టుపక్కల వారితో చెబుతుండేవాడు. ఈ క్రమంలో గురువారం నేను ఆత్మహత్య చేసుకుంటున్నానని సెల్ఫీ వీడియో తీసి వాట్సాప్ గ్రూపుల్లో పెట్టాడు. వీడియో వైరల్ కావడంతో కుటుంబీకులు, స్నేహితులు చుట్టుపక్కల గాలించినా ఆచూకీ లభించలేదు. పోలీసులకు సమాచారం అందించగా ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి సిబ్బందితో వెతికారు. ఈ క్రమంలో గ్రామ శివారులో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించి కిందపడ్డాడు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ వెంటనే వంశీని ఆస్పత్రికి తరలించారు.

ప్రముఖుల వాహనాలు తనిఖీ



కిషన్‌రెడ్డి కారును తనిఖీ చేస్తున్న అధికారులు



మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు కారు తనిఖీ

నర్సాపూర్: కేంద్ర సహాయ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి కారును గురువారం స్థానిక చెక్ పోస్ట్ వద్ద ఎన్నికల అధికారులు తనిఖీ చేశారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో నర్సాపూర్ హైదరాబాద్ జాతీయ రహదారిపై ఎన్నికల అధికారులు పట్టణ శివారులో చెక్ పోస్ట్ ఏర్పాటు చేసి వాహనాల తనిఖీ చేపట్టారు. కిషన్‌రెడ్డి హైదరాబాద్ నుంచి నర్సాపూర్ మీదుగా మెదక్ వెళ్తుండగా చెక్ పోస్టు వద్ద అధికారులు కారును ఆపి తనిఖీ చేశారు.

మెదక్ ఎమ్మెల్యే కారు

మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు కారును స్థానిక చెక్ పోస్ట్ వద్ద అధికారులు తనిఖీ చేశారు. రోహిత్‌రావు హైదరాబాద్ వైపు నుంచి నర్సాపూర్ మీదుగా మెదక్ వెళ్తుండగా అధికారులు కారును తనిఖీ చేసి పంపించారు. చెక్ పోస్టు వద్ద పండరి, సురేశ్ నాయక్, ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

జన బలం, ధన బలానికి మధ్య పోటీ

మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు



తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకుంటున్న రఘునందన్‌రావు

మెదక్‌జోన్: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా జరుగుతున్న ఈ పోటీ జన బలం.. ధన బలానికి మధ్య జరుగుతుందని మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. గురువారం నామినేషన్ వేసే ముందు రఘునందన్‌రావు తల్లిదండ్రులు భగవత్ రావు, భారతీల ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం కలెక్టరేట్‌లో నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్ల కల రామమందిర నిర్మాణమని, తన నామినేషన్ పత్రాలను బాలరాముని పాదాల వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేయించానన్నారు. కొందరు స్వార్థపరులు డబ్బు సంచులు, అధికార బలంతో వస్తున్నారన్నారు. రెండు దశాబ్దాలకు పైగా ప్రజా సమస్యలపై నిరంతరంగా పోరాటం చేస్తున్న తనను ఆశీర్వదించి పార్లమెంట్‌కు పంపితే దేశంలోనే మెదక్‌కు ప్రత్యేక గుర్తింపు తెచ్చి ఈ ప్రాంత అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి



శిక్షణ పొందుతున్న క్రీడాకారులు

మనోహరాబాద్(తూప్రాన్): యువత జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో రాణించాలని స్కూల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్, సాఫ్ట్‌బాల్ జిల్లా అధ్యక్షుడు నారాయణగుప్తా, సీఐ రవికుమార్, అసోషియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శోభన్‌బాబు, ఎస్‌ఐ హరీశ్ అన్నారు. గురువారం మనోహరాబాద్ క్రీడా ప్రాంగణంలో సాఫ్ట్‌బాల్ మూడవ జూనియర్ సౌజన్ నేషనల్ చాంపియన్ షిప్ 2023–24 ఎంపికలు నిర్వహించారు. ఎంపికకు ప్రతీ జిల్లా నుంచి ఒక అమ్మాయి, ఆరుగురు అబ్బాయిల చొప్పున పాల్గొన్నారు. వీరిలో 25 మంది క్రీడాకారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. శిక్షణలో ప్రావీణ్యం పొందిన వారిలో 16 మందిని ఎంపిక చేసి కర్ణాటకలో జరిగే పోటీలకు తెలంగాణ తరఫున పంపనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్యామ్ సుందర్ శర్మ, జిల్లా ఉపాధ్యక్షుడు గోవర్ధన్, సభ్యులు వెంకట్‌రెడ్డి, కుమార్‌గౌడ్, సురేశ్ కుమార్, కోచ్ రవి పాల్గొన్నారు.

అభివృద్ధి బాటలో పాలిమర్ పరిశ్రమ



పాలిమర్ పరిశ్రమలో పోలాండ్ రాయబారి, తదితరులు

మనోహరాబాద్(తూప్రాన్): పోలాండ్‌కు చెందిన పరిశ్రమ భారతదేశంలో అభివృద్ధి బాటలో పయనించడం ఆనందకరమని భారతదేశంలోని పోలాండ్ రాయబారి డాక్టర్ సెబాస్టియన్ డోమ్‌జలస్కీ అన్నారు. గురువారం ఆయన పోలాండ్ కాన్సుల్ జనరల్ డాక్టర్ అలెగ్జాండర్, ఆర్థిక వ్యవహారాల కౌన్సిలర్ పావెల్ మోర్క్ జైకి, పాలిమర్ స్టీల్ పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ సుబ్బారావులతో కలిసి స్టీల్ ప్లాంట్‌ను సందర్శించారు. అనంతరం వారు మాట్లాడుడూ.. కేంద్ర ప్రభుత్వం మేకిన్ ఇండియా పథకంలో భాగంగా మనోహరాబాద్ మండలం కాళ్లకల్, ముప్పిరెడ్డిపల్లి పరిశ్రమల వాడలో పాలిమర్ స్టీల్ పరిశ్రమను ఏర్పాటు చేసి ఎంతో మందికి ఉపాధి కల్పిస్తుందన్నారు. కొండాపూర్ పారిశ్రామిక వాడలో మరో యూనిట్‌ను 3 ఎకరాల్లో 2.5 మిలియన్ యూరోల పెట్టుబడితో నిర్మిస్తున్నామన్నారు. ఈ పరిశ్రమలో యూరోపియన్ రైళ్ల ఉత్పత్తి పరిశ్రమలకు కీలకమైన విడిభాగాలను తయారు చేస్తున్నామన్నారు. వీరి వెంట పరిశ్రమ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

పిడుగుపాటుకు పాడి గేదె మృతి



గేదె వద్ద బాధిత రైతు

వర్గల్(గజ్వేల్): పిడుగుపాటుకు పాడిగేదె మృతి ఘటన వర్గల్ మండలం వేలూరులో బుధవారం రాత్రి జరిగింది. బాధిత రైతు గడ్డం చంద్రయ్య తెలిపిన వివరాల ప్రకారం రోజూ మాదిరిగానే బుధవారం సాయంత్రం పాడి గేదె, దూడ, ఇతర పశువులను పొలం వద్ద చెట్ల కింద కట్టేశాను. రాత్రి ఉరుములు, మెరుపులతో పిడుగు పడడంతో పాడిగేదె మృతి చెందింది. సమీపంలోనే ఉన్న దూడ త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకుంది. గేదె విలువ రూ. 90,000 దాకా ఉంటుందని, రోజు 4 లీటర్ల పాలిస్తుందని రైతు చంద్రయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం పరిహారం అందజేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

న్యాయం కోసం ఆందోళన



సిద్దిపేటజోన్: ప్రేమపేరిట నమ్మించి మోసం చేసి పెండ్లికి నిరాకరించిన ఇమాంబాద్‌లోని ప్రియుడి ఇంటి ముందు ప్రియురాలు ధర్నా చేసిన విషయం పాఠకులకు తెలిసిందే. ఇదే నేపథ్యంలో గురువారం బాధిత స్వాతి బంధువులు గొడుగు గణేష్ ఇంటి వద్ద మళ్లీ ధర్నాకు దిగారు. గణేష్ కుటుంబీకులు ఇంట్లో ఉండటంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది.

నీరందేలా కృషి

ఉమ్మడి కరీంనగర్ జిల్లా భగీరథ సీఈ అమరేందర్

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని ప్రతి గ్రామాల్లో మిషన్ భగీరథ తాగునీరు అందేలా కృషి చేస్తున్నామని కరీంనగర్ జిల్లా మిషన్ భగీరథ సీఈ అమరేందర్ అన్నారు. గురువారం మండలంలోని పెద్దతండా, మోత్కులపల్లి గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో తిరుగుతూ తాగునీరు సమస్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎత్తైన ప్రాంతాల వద్ద, తండాలకు భగీరథ నీళ్లు ట్యాంకుల్లో ఎక్కేలా గండిపల్లి, మైసమ్మవాగుతండా, అక్కన్నపేట గ్రామాల్లో బూస్టర్ మోటార్లను ఏర్పాటు చేశామన్నారు. కానీ ఈ వేసవి ప్రారంభంలోనే భూగర్భ జలాలు అడుగంటిపోయాయన్నారు. అయినా గ్రామాల్లో మిషన్ భగీరథ రోజు సరఫరా చేస్తున్నామన్నారు. గ్రామాల్లో తాగునీరు సమస్యలు వస్తే అధికారుల దృష్టికి తీసుకు రావాలన్నారు. ఇప్పటికైనా ప్రతి పంచాయతీ కార్యదర్శులకు గ్రామాల్లో నీళ్ల సమస్యలు రాకుండా చూడాలని ఆదేశాలిచ్చామన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా మిషన్ భగీరథ ఎస్‌ఈ శ్రీనివాసచారి, డీఈ బాలరాజు, రుహిన తస్కిన్, డీపీఓ దేవకీదేవి, ఎంపీడీఓ భానోతు జయరాం ఉన్నారు.

రోగులకు స్క్రీనింగ్ పరీక్షలు

డీఎంహెచ్ఓ శ్రీనివాస్



అంబేడ్కర్ నగర్ అర్బన్ పీహెచ్‌సీలో శ్రీనివాస్

సిద్దిపేటకమాన్: జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. సిద్దిపేటలోని అంబేడ్కర్ నగర్ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రానికి వచ్చే 30 ఏళ్ల పైబడిన వారికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. వేసవి దృష్ట్యా అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలన్నారు. పీహెచ్‌సీలోని అన్ని రికార్డులను పరిశీలించారు. సిబ్బంది సమయ పాటించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సిద్దిపేట సీపీ అనురాధ

సిద్దిపేట కమాన్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట సీపీ అనురాధ హెచ్చరించారు. గురువారం కమిషనరేట్ పరిధిలో జరిగిని సైబర్ నేరాల వివరాలను వెల్లడించారు. సిద్దిపేట 1వ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తికి తక్కువ మొత్తంలో పెట్టుబడి పెడితే ఎక్కువ లాభాలు వస్తాయనే మెసేజ్ వచ్చింది. అది నమ్మిన బాధితుడు పలు విడతలుగా తనకు మెస్సేజ్ వచ్చిన నంబర్‌కు రూ.88,403 పంపించాడు. తర్వాత ఆ నంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్‌ఆఫ్ రావడంతో తాను మోసపోయినట్లు గ్రహించి జాతీయ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు. అదేవిధంగా మద్దూర్ పోలీసు స్టేసన్ పరిధిలోని ఓ వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి నుంచి వచ్చిన వీడియో కాల్‌కు స్పందించి మాట్లాడాడు. తనతో మాట్లాడిన న్యూడ్ ఫోన్ కాల్ వివరాలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానని బెదిరించడంతో ఆన్‌లైన్‌లో రూ. 21,500 పంపించాడు. బాధితుడు జాతీయ హెల్ప్‌లైన్ నంబర్‌క 1930కు ఫిర్యాదు చేశాడు.

తునికాకు తుస్

- టెండర్లు పిలిచేందుకు అధికారుల నిరాసక్తత
- బీడీలు చుట్టేందుకు పనికిరాదంటూ నిలిపివేత
- ఐదేళ్లుగా ఆగిపోయిన వైనం
- ఉపాధి కోల్పోయిన బీడీ కార్మికులు
- 48 ఎకరాల్లో విస్తరించిన ఫారెస్టు

మెదక్‌జోన్: పల్లె జనానికి ఆకుల రూపంలో కాసులు కురిపించే తునికాకు సేకరణపై నీలినీడలు కమ్ము కున్నాయి. బీడీలు చుట్టేందుకు జిల్లాలో కాసిన తునికాకు పనికిరావడం లేదంటూ ఫారెస్టు అధికారులు ఐదేళ్లుగా ఆకు సేకరణకు టెండర్లు పిలవడం లేదు. ఒకప్పుడు వేసవిలో తునికాకు సేకరణతో పేదలు మంచి ఆదాయం పొందేవారు. నాలుగు మాసాలపాటు ఉపాధి లభించేది. ప్రభుత్వానికి కూడా ఆదాయం సమకూరేది. అలాంటి తునికాకు సేకరణ పూర్తిగా మరుగున పడేయడంతో పేదలు ఉపాధి కోల్పోయారు.

మెదక్ జిల్లాలో కొడిపల్లి, మెదక్, నర్సాపూర్, పెద్దశంకరంపేట, రామాయంపేట, తూప్రాన్ ఫారెస్ట్ రేంజ్‌లు ఉండగా వాటి పరిధిలో 148 ఎకరాల దట్టమైన అడవి విస్తరించి ఉంది. వీటి పరిధిలో కొల్చారం, కొడిపల్లి, హత్నూర, కమలాపూర్, వెల్దుర్తి, నర్సాపూర్ బ్రాంచ్‌లుగా విభజించి టెండర్ పిలిచేవారు. కాంట్రాక్టర్లు ముందుకు వచ్చి టెండర్లను చేజిక్కించుకొని ఊరూరా తునికాకు కళ్లాలు ఏర్పాటు చేసి గ్రామాల్లో చాటింపు వేయించి ఆకు సేకరణకు పిలిచేవారు.ప్రతీ ఏటా వేసవిలో మార్చి, ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో జోరుగా సేకరణ జరిగేది. ఆకు సేకరణలో అత్యధికంగా గిరిజన మహిళలది ప్రధాన పాత్ర. వీరి నివాస గిరిజన తండాలు అడవులకు దగ్గర ఉండటంతో తెల్లవారుజామునే అడవికి చేరుకొని ఆకు సేకరణలో నిమగ్నమయ్యేవారు.

ఆకు పనికిరాదనే సాకుతో..

జిల్లాలో ఆకుసైజు తగ్గిందని, నాణ్యత లేదనే సాకుతో అధికారులు సేకరణకు టెండర్లు పిలవడం మానేశారు. దీంతో పేద ప్రజలకు ఉపాధి లేకుండా పోయింది. జిల్లాలోని దట్టమైన అడవుల్లో తునికాకు చెట్లు రెండు మీటర్ల ఎత్తులో పెరిగి చెట్టు నిండా ఆకులతో ఉన్నాయి. ఒక్క చెట్టు ఆకు తెంపితే 5–8 కట్టల ఆకు లభిస్తోంది. ప్రస్తుతం ఒక్కో తునికాకు కట్ట ధర మార్కెట్‌లో రూ.7 పలుకుతుంది. ఒక మహిళ నిత్యం 100 కట్టల ఆకు సేకరణ చేయొచ్చని పలువురు పేర్కొంటున్నారు.

2019 వరకు ఆకు సేకరణ..

జిల్లాలో 2019 వరకు తునికాకు సేకరణ జోరుగా సాగింది. దీంతో గ్రామీణ ప్రాంత పేదలకు చేతినిండా పని దొరికేది. కానీ ప్రస్తుతం టెండర్లు పిలవడం లేదు. చివరిగా 2019లో టెండర్ల ద్వారా 1,04,014 (ఎస్‌బీ)ల ఆకు సేకరించడం జరిగింది. ఒక్కో ఎస్‌బీలో 3 లక్షల తునికాకు కట్టలు ఉంటాయి. ఒక్క కట్టలో 100 ఆకులు ఉంటాయని అధికారిక రికార్డులు చెబుతున్నాయి.



రాయినిపల్లి అడవిప్రాంతంలో ఏపుగా పెరిగిన తునికి చెట్లు

ఐదేళ్లుగా నిలిపి వేశాం

జిల్లాలో తునికి ఆకు టెండర్లు 2020 నుంచి పిలవడం లేదు. 2019లో చివరిగా సేకరించారు. అప్పట్లో నేను ఈ జిల్లాలో లేను. ఆకు సైజు చిన్నగా ఉండంటంతోపాటు నాణ్యతగా లేదని టెండర్లు పిలవటం మానేసినట్లు తెలిసింది.

– రవి ప్రసాద్, డీఎఫ్ఓ, మెదక్